తప్పు 'భా'కు ఒత్తుండాలి అన్నారు పాఠకుడుగారు. ఒత్తులు పలక్క పోతే మట్టుకు బావం సరిగా వుంటే చాలదా అని పాఠకీమణి అన్నారు నవ్వుతూ. బావం కాదండీ భావం అన్నాన్నేను. పోన్లెస్తురూ - ఇది ప్రజా యుగం. కళల్నీ రాజకీయాల్నీ ప్రజల దగ్గరకు తెస్తున్నప్పుడు ఒత్తుల్తో సహా తేవాలని ఎక్కడుంది అన్నారు మావారు.

బర్తల మాట బార్యలు వినాలికదా అంది పాఠకీమణి. అయ్యో "భర్తలండీ -భార్యలు. భర్తకి భార్యకి ఒత్తులుండాల్సిందే" అన్నాడు పాఠకుడుగారు.

"ఈ సారి రెండొత్తులు పోయాయి" అని నవ్వేన్నేను. "మరి మాట్లాడకండి - మాట్లాడితే అనవసరంగా ఒత్తులు జారిపోతాయి" అన్నాడు పాఠకుడుగారు. మావారు గంభీరంగా మొగంపెట్టి "రేడియో స్టేషన్‌కి వెళ్లేదారిలో వక్తలు పారేసుకున్న ఒత్తులు బోల్డు దొరుకుతాయి" అని చమత్కరించారు. కలకంఠి కన్నీరొలగ్గా లేంది. అక్షరాలకు ఒత్తులు జారిపోతే తప్పా? నాన్సెన్స్!

# భజనపాటలు

ఈ ప్రపంచం
మనకు ఏవిటిచ్చింది?
ఈ ప్రపంచాన్నుంచి
మనం ఏవిటి స్వీకరించాము?
మా అందరి గురించి
పట్టించుకునే వారెవరు?
అంతా మా కోసం ఏం చేశారు?

అంచాత "ఇష్" మాట్లాడొద్దు - మీ దుఃఖాలూ, మీ వ్యధలూ, బాధలూ అన్నీ తొలగిపోవాలంటే?

"దమ్ములాగండ్రా, దమ్ము దమ్ము లాగుతూ ఉదయం సాయంత్రం భజన చేయండి"

'హరేకృష్ణ హరేరాం' అంటూ -

దమ్ము కొడుతూ ఉదయం, సాయంత్రం "హరేరాం హరేకృష్ణ" అంటూ నామసంకీర్తనం చేస్తే మీ బాధలు తొలగిపోతాయి. ఇది దీని ఉపదేశం లేదా తాత్పర్యం.

పది రూపాయల నోటిచ్చి మార్చుకురండ్రా చిల్లర అని మా వాళ్ళని వీధిలోకి పంపితే, ఆ నోటు పట్టుకుపోయి -

"దమ్ మారో దమ్

మిట్ జాఁయె గఁమ్
బోలో సుబహ్ శామ్

హరేకృష్ణ హరేరాం" అని పాడుతూ వచ్చారు. ఈ రికార్డెందుకర్రా తెచ్చారు వెధవల్లారా అంటే చిల్లర మార్చడానికి ఏదన్నా కొనాలి గదా అని నోటు మార్చి యిది తెచ్చాం. "అమ్మా! దమ్ మారో దమ్, మిట్ జాయే గమ్" అన్నారు వాళ్ళు. అని మూడురూపాయలిచ్చారు మిగిలాయని. ఆ రికార్డుతో ఇల్లంతా హోరెత్తించేశారుఒకటే మూలగడం మూలిగి మూలిగి "యా" అంటూ నోరు తెరవడం, ఒకళ్ళ మీదొకళ్ళు పడి గెంతటం ఇదీ వరస. పైగా తిడితే ఇది భక్తి పాటమ్మా అని వాళ్ళు నాకు సర్దిచెప్పటం. వీళ్ళకు భక్తేవిటి నా మొహం? అల్లా అయితే మన పాత భజన పాటలన్నీ కూడా "ఫ్లాప్ మ్యూజిక్"కి పనికొస్తాయి కావును అనిపించింది. భక్తి కూడా నిషా కలిగించే మత్తుపదార్థమే గనుక బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలన్నీ పాప్‌బీట్ కుదిర్తే బ్రహ్మాండమైన హిట్‌సాంగ్సవుతాయి.

"రామ రామ రామసీతా" అనే సంకీర్తనం బాణీ వుందనుకోండి. అది "నాన నాన నాన నానా" అని వూగిపోతూ చివర మూలుగు పెట్టి 'యా' అని నోరు తెరవటం చేస్తే పైకి డెలిక్ మ్యూజిక్కవుతుంది చచ్చినట్టు.

అప్పనా తనామనా అంటే ఏవిటండీ గురూగారూ అని అడిగా "అప్నా తన్‌మన్" అవుతుందన్నారు. రైట్ -"మారోరి" అంటే ఏవిటండీ సార్ అన్నా, "మార్ అరె" అన్నారు. "ఈ భైరన్నా" ఏంటండీ - అంటే, భైరన్న ఈజ్ ఎప్రాపర్ నవున్ "మనిషియొక్క పేరే మగువా" అన్నారు. "అప్నా తన్‌మన్ మారో అరెభైరన్నా" ఇది కూడా బండివాళ్లు ఐమీన్ ఎద్దు బండివాళ్ళు, జోడెద్దుల వాళ్ళు కూడా సారాయి ఓ పట్టుపట్టి "అప్పనా తనామనా మారోరె భైరన్నా" అని పాడే వారనుకుంటాను, ఇది కూడా చాలా గొప్ప ట్యూను అవుతుంది. "నన్న నా ననా ననా నానాన నై ననా" ఈ వరస ఏ హిందీవాడో దొంగిలించి పాటకడితే మనం వెర్రి మొహం వేసుకుని వింటాం. మనవి వెర్రి మొహాలు కనుక. ఉంకో పాటుంది మా వారు చెప్పారు, నాకూ తెలుసనుకోండి, మీకూ తెలుసనుకుంటాను.

"నెర నెర నెర బండీ....
అబ్బ దాని సోకో
జబ్బల దాకా జాకెట్టు"
"నన నన నననన్నా, నన్న నాన నానా నన్నన నానా నానన్న"
ఇలా అవుతుంది సూక్ష్మీకరిస్తే.
బ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలు తీసుకోండి మచ్చుకి -
"చెప్పలేదంటనక పొయ్యేరు
జనులార గురుని
చేరిగొల్చిన ముక్తినందేరు" దీనివరస కూడా హైపిచ్‌లో పాడితే బావుంటుంది.

"తోలుతిత్తి యిది

తూటులు తొమ్మిది

తుస్సుమనుట ఖాయం - జీవా

తెలుసుకో అపాయం" దీని ట్యూన్ కూడా ఏకతార మీటితే చాలా హాయిగా వుంటుంది వినడానికి. అన్నిటికంటె నాకిష్టమైన మరో పాటవుంది. "రామ జోగి మందూ కొనారే, ఓ జనూలారా రామ జోగీ మందూ కొనారే - కాటుకా కొండలావంటీ ఖర్మమూ లెడబాసే మందూ" అలాగే మరో పాట.

"రామనామం రామనామం

రామనామం రామనామం

రమ్యమైనది రామనామం"

మరోటి బ్రహ్మంగారి తత్వం. రైళ్లలో చిరతలు వాయిస్తూ బిచ్చగాళ్ళు గొంతెత్తి పాడుతూ వుంటారు - "ఏమిజల్మం బేమి జీవనమూ". ఈ భజన పాటలలో దీపం శమ్మా చుట్టూ తిరిగి అడుగులు వేస్తూ చెక్కలతో చేసే భజన - "అక్కడ వుండే పాండురంగడు ఇక్కడ వున్నాడే" అనేదీ. "రంగా రంగా యనరే, మంగళకరుడగు పాండురంగని" అని వస్తుంది? ఇది కూడా చాలా హాయిగా, శ్రావ్యంగా వుంటుంది వినడానికి. పాత పాటలని తేలిగ్గా కొట్టిపారవెయ్యడానికి వీల్లేని ట్యూన్లు యెన్నో వున్నాయి మనకి. తల్చినకొద్దీ తరగని గని. భక్తి పాటల్లో సంగీతాన్ని ఎమోషన్ జయిస్తుంది. పద్యాలూ పాటలు లేకపోతే జీవితం చప్పగా చల్లారి పోయినట్లు వుంటుంది. రామదాసు కీర్తననుకుంటాను మరీ చూడండి -

'రామ రామ రఘురామ పరాత్పర

రావణ సంహర రణధీరా' అనేది మార్చింగ్ సాంగ్‌లా ఉంటుంది. ఇది డోలక్‌మీద దరువులు వేస్తూ పాడితే కూర్చున్న వారైనా సరే లేచి నిలబడి నాట్యం చేయాల్సిందే. జాతీయోద్యమంలో వచ్చిన గీతాలన్నీ చాలావరకు భజన పాటల మీంచి రాసినవే. 'రామ నామమను మిఠాయి ఇదిగో' అనే పాటమీంచి గాంధీమహాత్మునిమీద పాటకట్టి పాడారు. "రాధేగోపాలకృష్ణ, రాధే గోవింద కృష్ణ" అని కృష్ణభజన పాటలు కూడా వేరే వుండేవి. "రఘుపతి రాఘవ రాజారాం పతీత పావన సీతారాం సీతారాం జై సీతారాం" ఇది అందరికీ తెలిసినదే - దీని ట్యూన్ రకరకాలుగా మార్చుకోవచ్చు.

ఇంతకీ చెప్పొచ్చే దేవిటంటే మనకూ వున్నాయి బ్రహ్మాండమైన పాటలు, ట్యూన్లు కాస్త ఓపిక చేసుకుని మన కీర్తనలు పాటలూ పజ్యాలు కాలగర్భంలో కలిసిపోకుండా ఆధునికం చేసుకుని వాడుకుంటే బలేమజాగా బాగుంటుంది. వాటిని తిప్పి తిప్పి కొట్టడవే. నేనూ మా వారు భక్తిమీద ఒక న్యూవేవ్ పిక్చర్ తీస్తాం. అందులో టైటిల్ సాంగ్ "ఓ రోరి బండి వాడా" పెడతాం. భజన పాటలతో "దమ్‌మారో దమ్ మిట్ జాయ్‌గమ్" అనిపిస్తాం. ఆడంగి పాటలు పీకుడు పాటలూ పెట్టం, మ్యూజిక్ కూడా మ్యాన్లీగా వుండాల్సిందే.

భజన పాటల్లోనే కాదు కళ్ళు పెట్టుకుని వెతికితే బుర్రకథల్లోనూ మర్డర్‌సాంగ్స్‌లో కూడా "పాప్ బీట్" దొరుకుతుంది.

"హరి హరీ నారాయో ఆది నారాయో

కరుణించి మమ్మేలూ

కమలలోశనుడా –" ఇది కూడా పాప్‌సాంగ్‌కి పనికొస్తుంది. భజన పాటా, పాత గ్రామఫోను రికార్డూ, బ్రహ్మంగారి తత్వం, రామదాసుకీర్తన, మంగళహారతీ కాదేదీ ఇల్లాలి ముచ్చట్ల కనర్హం. బోలో సుబహ్‌శామ్ హరేకృష్ణ హరేరామ్!

# అలివేణీ - తరవాణీ

పిల్లలకు చద్దెన్నాలు పెట్టడం 'ఫాషన్' కాదనుకునే తల్లులున్న రోజులివి. వెనకటి రోజుల్లో మహాతల్లులు చూసీచూడకుండా పిల్లలకు చద్దెన్నాలు కలిపి పెడుతూ ఒకటీ అరా ఆవకాయ, గోంగూర, ఉల్లిపాయ పచ్చడి ముద్దలు నోట్లో వేసుకునేవారు. పరమ పతివ్రతలైనా చద్దన్నాలు తినకుండా వుండలేకపోయేవారు. వెనక చుట్టాలింటికి ఏ వూరైనా వెళితే చద్దెన్నం తింటావా, కాఫీ తాగుతావా అని అడిగేవారు. ఇప్పుడా క్రొశ్న అడిగేవారు లేరు. బాత్రూములొచ్చి మగాళ్ళు కూడా నెకెడ్ బాతులారంభించాకా కాలవల్లో, చెరువుల్లో స్నానాలు అంతరించాయి. కాఫీ హోటళ్లలో టిఫిన్ల ఆరగింపులారంభమయాక చద్దన్నాలవుటాఫ్ ఫ్యాషనులయిపోయాయి. నన్నడిగితే మనప్రాచీన భోజన హిందూ సంస్కృతిలో చద్దెన్నాలకొకవిశిష్టమైనస్థానం వుందంటాను. పాత అలవాట్లు కొన్ని అంతరించిపోతున్నాయి. ఖరీదైన అలవాట్లు వచ్చి సమష్టి కుటుంబ జీవితపు జీవన విధానం మీద దెబ్బ తీశాయి. హోటళ్ళు కిల్లీ దుకాణాలు వెలిశాక 'ఇంటిదొంగ' లెక్కువయారు. మా ఊళ్ళో కుర్రాళ్ళు కొబ్బరికాయ లెత్తుకుపోయి కిల్లీ కొట్లో యిచ్చి సోడాలు బీడీలు తాగేవారు. కొబ్బరికాయలమ్మి టీకొట్లో దూరే వాళ్ళిప్పటికీ వున్నారు. వడ్లుపోసి అవీ ఇవీ కొనుక్కున్నట్లు కొబ్బరికాయ లిచ్చి కావలసినవి తీసుకోవడం ఇంకా వుంది. ఆడాళ్ళు కాపర్సుకరువై నప్పుడల్లా కొబ్బరికాయలతో స్మాల్ స్కేల్ బిజినెస్సులు నడిపేస్తారు. మని లేనంత మాత్రానా కోరికలు ఆగుతాయా?

కాలవలో స్నానంచేసి, ఆవకాయకు గేదేపెరుగుని జోడించి చద్దెన్నం, కొట్టేస్తే ఆమత్తులో ప్రపంచం మరోలా కనిపిస్తుంది. చద్దెన్నం ఫిలాసఫీ అని వుంది. అందులోంచి వచ్చిన సామెత "చద్దెన్నం తిన్నమ్మ మొగుడాకలెరుగదని" ఆ మాటనిజవే-మనం గోంగూర పచ్చడి చిక్కని మజ్జిగ వేసుకుని ఓ కంచం ఉదయ సూర్యుని సప్తహయాలూ పరిగెత్తే వేళ లాగిస్తే "ఆకలి సమస్య" అనేది ప్రపంచమంతటా తీరిపోయినట్టే వుంటుంది. నాకు అప్పగింతలప్పుడు మావాళ్ళు "అమ్మాయి చద్దెన్నం తినకుండావుండ లేదు." "నాలుగావకాయ పెచ్చులు వెయ్యొదినా" అంటూ